# ఢాం ఢాం ఢాం

నాకు ఈ పద్యం, దాని వెనక ఉన్న కథ ఎవరో అజ్ఞాత వ్యక్తి పంపించారు- అసలు పేరు తెలియదు కాని నాకు వచ్చిన ఈమెయిలు లో పేరు "బాలసాహిత్యం" అని ఉంది. ఈ చిన్నప్పటి పద్యం మరల నాకు గుర్తు చేసి మీ ముందుకు తీసుకుని రావటానికి సహకరించిన ఆ అజ్ఞాత వ్యక్తికి ధన్యవాదాలు.

తోక పోయి కత్తి వచ్చె ఢాం ఢాం ఢాం
కత్తి పోయి కట్టె వచ్చె ఢాం ఢాం ఢాం
కట్టె పోయి దోసె వచ్చె ఢాం ఢాం ఢాం
దోసె పోయి డోలు వచ్చె ఢాం ఢాం ఢాం
ఢాం ఢాం ఢాం ఢాం ఢాం ఢాం

ఈ పాట వెనక ఒక కథ ఉంది. ఒక కోతి పనీ పాటా లేక కోతి పనులు చేస్తుంటే దాని తోకలో ఒక ముల్లు దిగిందిట. అది ముల్లు గుచ్చుకున్న బాధతో ఉండగా దాని బాధ చూసి, పాపం తలిచి, దారిన పోతున్న ఒక మంగలి, ముల్లుని తన దగ్గర ఉన్న కత్తితో తీయడానికి ప్రయత్నించాడుట.

అలా ప్రయత్నిస్తుంటే కోతి కదలడంతో దురదృష్టవశాత్తు కోతి తోక కాస్తా తెగి పోయిందిట. అది ఆ మంగలిని నా తోకని నాకిస్తావా లేదా అని నిలదీసిందిట. పాపం అతను ఏమి చేయడానికీ పాలుబోక చివరికి తన ఏకైక సొత్తైన కత్తిని దానికి అప్పజెప్పి తన దారిన వెళ్ళాడుట.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఆ కోతి ఆ కత్తిని పట్టుకుని దారిన పోతుంటే ఒక కట్టెలు కొట్టేవాడు తన కట్టెల మోపుతో వెళుతూ, కర్మ కాలి ఆ కోతి దగ్గర్నుంచి ఆ కత్తిని దేనికో అరువు తీసుకుని, దాన్ని కాస్తా నిష్కారణంగా విరగగొట్టేశాడుట.

దానితో కోతికి తిక్క రేగి, నా కత్తినిస్తావా చస్తావా అని ఒంటి కాలు మీదా నిలుచుందిట. ఇక చేసేదేమీ లేక కట్టెలు కొట్టేవాడు, తన దగ్గర ఉన్న కట్టెల మోపును కాస్తా ఆ కోతి పరం చేసి వెళ్ళాడుట.

ఆ కట్టెలు తీసుకుని మన కోతి ఆ దారినే పోతుంటే, అక్కడ ఒక దోసెలువేసి అమ్ముకునే ముసలావిడ ఒకామె కనిపించిందిట. ఆవిడ దగ్గర పొయ్యిలోకి కట్టెలు కరువయ్యాయిట. కోతి దగ్గర మోపు చూసి, నీ కట్టెలు నాకిస్తావా అని అడిగిందిట.

కోతి సంగతి వేరే చెప్పాలా? దానిది అసలే చాలా విశాల హృదయము కదా? వెంటనే సరేనని మోపు కాస్త ముసలావిడకి అర్పించుకుందిట. ఆవిడ గబగబా ఉన్న కట్టెలన్నిటినీ కరువో కాలమో అన్నట్లు పొయ్యిలో పెట్టి పెనం మీద ఒకటి తర్వాత ఒకటి పెద్ద దొంతర దోసెలు వేసిందిట.

మన కోతి నిదానమే ప్రధానమని తెలిసినది కాబట్టి కట్టెలన్నీ పూర్తిగా కాలేదాకా వేచి ఉండి, అవి పూర్తిగా మసి అయ్యాయన్న నిర్ధారణకి వచ్చిన తర్వాత, ముసలావిడ పీక పట్టుకుని, నా కట్టెలిస్తావా లేక నీ దోసెలిస్తావా అని మొరాయించిందిట.

ఇక ముసలావిడ చేసేదేమీ లేక ఆ దొంతరకు దొంతర దోసెలు కాస్తా ఆ మర్కటేశ్వరుడికి నైవేద్యం పెట్టిందిట.





PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఆ దోసెలు పుచ్చుకుని మళ్ళీ ఆ కోతి దారి పట్టిందిట. అక్కడ ఒక డోలు వాయించే ఒకతను తన డోలుతో ఆకలితో కనిపించాడుట. కోతి దగ్గర దోసెలు చూసి, వాటిలో కొన్నింటిని నాకిస్తావా అని అడిగాడుట. మరి కోతేం చేస్తుంది, తీసుకో బాబూ అని వాటిని కాస్తా ఇచ్చేసిందిట.

వాటిని విద్వాంసులుంగారు ఫలహారం చేసి, ఆకలి తీరిందిలె మ్మని మురిసిపోతుంటే, కోతి నా దోసెలిస్తావా నీ డోలు ఇస్తావా అని కూర్చుందిట.

దానితో వాదించి ప్రయోజనం లేదని తెలుసుకున్న విద్వాంసుడు తన డోలుని ఆ కోతికర్పించి తన దారిన తాను చక్కా పోయాడుట.

అప్పుడు ఆ కోతి ఆ డోలు పట్టుకుని ఢాం ఢాం ఢాం అని వాయిస్తూ పై పాటని పాడిందిట.

కథ కంచికి, మనం ఇంటికి.

Keywords: kOti, DhAm DhAm DhAm, dOse, kaTTelu, kaTTe, katti, DOlu, vidwAn, poyyi, manta, markaTam, mullu



PDF created with pdfFactory trial version www.pdffactory.com